క్లుప్తంగా

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



రంగంపేట ఎంపీడీఓ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

రంగంపేట: తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సచివాలయ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటింటా సర్వేలు, ఇతర అదనపు పనులు చేయించరాదని, పది గంటల పని వేళలు అమలు చేయాలని, సెలవు రోజుల్లో బలవంతపు విధులు వేయరాదన్నారు. అసాధారణ పని ఒత్తిడి వల్ల ఉద్యోగులు మానసిక సమస్యలకు గురవుతున్నారన్నారు. సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్ర సంఘం నిర్ణయం మేరకు ఆందోళనలు చేపడతామని ఉద్యోగులు స్పష్టం చేశారు.

ప్రత్యేకావసరాల పిల్లలకు ఉపకరణాలు

కోరుకొండ: ప్రత్యేకావసరాల పిల్లలకు ఉపకరణాలు అందజేస్తామని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. బుధవారం కోరుకొండ ప్రభుత్వ హైస్కూల్‌లో సమగ్రశిక్ష- పాఠశాల విద్యాశాఖ, సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో దివ్యాంగ పిల్లలకు ఉపకరణాల అందజేతలో భాగంగా నిర్ధారణ శిబిరం జరిగింది. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, సమగ్రశిక్షా ఏపీసీ సుభాషిణి, ఎంపీడీఓ బత్తిన అశోక్ కుమార్, సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ పాల్గొన్నారు.

రక్తదానం ఎంతో ఉత్తమం



రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రతినిధులు

రాజానగరం: రక్తదానం ఎంతో ఉత్తమమైందని, ఇది ఆపదలో ఉన్నవారికి సంజీవనిలా నిలుస్తుందని స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ ప్రొ.వీసీ డాక్టర్ కేవీబీ రాజు అన్నారు. యూనివర్సిటీలో బుధవారం నిర్వహించిన ఉచిత రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ పీఏ బి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో 120 మంది వలంటీర్లు రక్తదానం చేశారు. వీరికి సర్టిఫికెట్లను రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీఎస్ బాబు అందజేశారు.

ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: యువత ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ ఫైనలియర్ విద్యార్థులకు మూడు రోజులపాటు జరిగే క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్ బుధవారం ప్రారంభమైంది. ఈ శిక్షణ ద్వారా విద్యార్థులను సాంకేతిక పరిజ్ఞానం, సాఫ్ట్ స్కిల్స్, ఉపాధి సామర్థ్యాన్ని పెంపొందిస్తూ కార్పొరేట్ ఉద్యోగ మార్కెట్‌కి సంసిద్ధులను చేస్తారన్నారు. కార్యక్రమానికి ఎస్‌డీవీవీఎల్ సంస్థ ప్రతినిధులు ప్రశాంతి, సునీత రిసోర్స్‌పర్సన్లుగా వ్యవహరిస్తున్నారు.

దరఖాస్తు చేసుకోండి

ఆదికవి నన్నయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ (పార్ట్ టైమ్, ఫుల్ టైమ్) చేసేందుకు ఆసక్తి ఉన్నవారు అక్టోబర్ 4లోగా దరఖాస్తు చేసుకోవాలని వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. యూజీసీ నెట్, జేఆర్ఎఫ్‌లలో అర్హత సాధించిన వారికి మాత్రమే అవకాశం ఉందన్నారు. ఇతర వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

రోగులకు పండ్లు, బిస్కెట్ల పంపిణీ

కోరుకొండ: ప్రధాని మోదీ జన్మదినోత్సవం సందర్భంగా కోరుకొండలో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బీజేపీ మండల అధ్యక్షుడు అడపా సుధీర్ ఆధ్వర్యంలో పండ్లు, స్వీట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. నాయకులు రమణి, తగరంపూడి గణపతి, పి.నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల అందజేత

బిక్కవోలు: ప్రధాని మోదీ జన్మదినోత్సవం సందర్భంగా ఊలపల్లిలో పంచాయతీ కార్మికులకు కూరగాయలు అందించారు. పేదలకు కూరగాయలు, పండ్లు అందజేశారు. ఎంపీపీ తేతలి సుమ, ఊలపల్లి సర్పంచ్ బండారు రమ్య, వైస్ ఎంపీపీ పెంకె మంగయ్యమ్మ, బీజేపీ మండల అధ్యక్షుడు గుడిమెట్ల దుర్గారెడ్డి పాల్గొన్నారు.

సంరక్షిద్దాం.. జీవం పోద్దాం

- పశువుల పెంపకంలో జాగ్రత్తలు అవసరం
- వ్యాధులు ప్రబలకుండా టీకాలు వేస్తున్న సిబ్బంది

కోరుకొండ: వర్షాకాలం.. వ్యాధుల సమయం. ఇప్పుడే పశువుల సంరక్షణలో జాగ్రత్తలు అవసరం .. వర్షాలు పడేటప్పుడు పశువుల్లో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. వాతావరణ మార్పుల కారణంగా ప్రధానంగా దొమ్మ, గాలికుంటు, జబ్బవాపు తదితర వ్యాధులు సోకుతాయి. తగిన జాగ్రత్తలతో వాటిని అదుపు చేయడమే కాకుండా, సోకకుండా చూడవచ్చని అధికారులు చెబుతున్నారు. రాజానగరం నియోజకవర్గంలో 19,565 ఆవులు, 44, 076 గేదెలు ఉన్నాయి. వీటికి వ్యాధులు సోకుండా ముందస్తు జాగ్రత్తలో భాగంగా ఈ నెల 15వ తేదీ నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకూ టీకాలు వేసే కార్యక్రమాన్ని పశు సంవర్ధకశాఖ నిర్వహిస్తోంది. కూటమి ప్రభుత్వం ముందస్తు చర్యల్లో భాగంగా రైతులకు అవగాహన కల్పించాలి. కానీ వ్యవసాయం- పాడి పరిశ్రమను పట్టించుకోవడం లేదని రైతులు అంటున్నారు. వర్షాలు ప్రారంభమైన చాలా రోజుల తర్వాత ఇప్పుడు టీకాలు వేసే కార్యక్రమాన్ని చేపట్టిందని నిట్టూర్పు వదులుతున్నారు.



కొట్టంలో పశువులు



వ్యాధి సోకిన పశువులకు వ్యాక్సిన్ వేస్తున్న పశు వైద్య సిబ్బంది

రోగాలు.. అనర్థాలు

పాడి పశువులకు సోకే వ్యాధుల కారణంగా పాల ఉత్పత్తి తగ్గిపోతుంది. పాలు తాగే దూడలు మరణిస్తాయి. ప్రధానంగా దొమ్మ వ్యాధి గేదెలకు సోకుతుంది. దీనిని నిర్లక్ష్యం చేస్తే ఆ పశువులు మృతి చెందుతాయి. వర్షాలతో కలుషితమైన ఆహారాన్ని తీసుకోవడం వల్ల ఇది ఎక్కువగా వ్యాప్తి చెందుతుంది. నోరు వాచి, విపరీతమైన జ్వరం వస్తోంది. దీంతో ఆహారాన్ని తీసుకోవడం కష్టమవుతోంది. శ్వాస సంబంధిత సమస్యలు వస్తాయి. దీని నివారణ చర్యల్లో భాగంగా ముందస్తుగా టీకాలు వేయించాలి. పశు వైద్యులను సంప్రదించి వైద్యం చేయించాలి.

- జబ్బ వాపు పశువుల్లో సోకే వ్యాధుల్లో ప్రమాదకరమైంది. దీనిని బ్లాక్ క్వాటర్ అని పిలుస్తారు. ఇది సహజంగా తెల్ల ఆవులకు వస్తోంది. దీని కారణంగా ఎడమకాలు వాచిపోతుంది. యుక్త వయసులోని ఆవులకు సోకే ఈ వ్యాధితో అతి తీవ్రమైన జ్వరం వస్తోంది. పశువు నీరసించిపోతుంది. సకాలంలో వైద్య అందకపోతే చనిపోతుంది.
- పశువులను భయపెట్టే రోగాల్లో గాలికుంటు ఒకటి. ఇది వైరస్. ఈ సీజన్‌లో పశువులకు సోకుతుంది. పశువుకు నోటిలో, కాళ్లపై పుండ్లు ఏర్పడతాయి. జ్వరం కూడా తీవ్రంగా ఉంటుంది. సకాలంలో వైద్య చేయించకపోతే పశువులు కోలుకోవడం కష్టం. అందుకే ముందుగా టీకాలు వేయించడం ఉత్తమం.

రైతులు సహకరించాలి



పశువుల సంరక్షణకు టీకాలు వేయించాలి. ఈ నెల 15వ తేదీ నుంచి అక్టోబర్ 15 వరకూ టీకాలు వేసేందుకు కార్యాచరణ చేశాం. తద్వారా పశువులు రోగాల బారిన పడకుండా ఉంటాయి. పాల దిగుబడి పెరుగుతుంది. కోరుకొండ, గోకవరం, సీతానగరం మండలాల్లో రోజూ టీకాల వేసే కార్యక్రమం జరుగుతోంది. రైతులు సహకరించాలి.

– పి.ప్రభావతి, ఏడీ, పశు సంవర్ధకశాఖ, కోరుకొండ

వృత్తులను వారసత్వ సంపదగా అందించాలి

రంగంపేట: భావితరాలకు నైపుణ్య వృత్తులను వారసత్వ సంపదగా అందించాలని బీజేపీ మండల అధ్యక్షుడు మైలవరపు సాయిరాం సూచించారు. స్థానిక పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివారి ఆలయంలో విశ్వకర్మ భగవాన్ జయంతి వేడుకలను నిర్వహించారు. ప్రధాని విశ్వకర్మ యోజనలో శిక్షణ పొందిన విశ్వ బ్రాహ్మణులకు బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మండవిల్లి గుప్తా, సర్పంచ్ కూటి సాయిబాబు, ఉప సర్పంచ్ పోతుల వీరన్న కిట్లను పంపిణీ చేశారు. అమ్మ పేరుతో మొక్కలు నాటారు. ఆలయ ధర్మకర్త సిద్ధాంతపు సత్తిబాబు, మండల విశ్వబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు దార్ల అమ్మిరాజు, నాయకులు ఉండవల్లి మాణిక్యం, పేపకాయల రామచంద్రరావు పాల్గొన్నారు.



విశ్వకర్మ యోజనలో లబ్ధిదారులకు కిట్లు అందిస్తున్న గుప్తా తదితరులు

సర్వేలు వేగవంతం చేయాలి

బిక్కవోలు: సర్వేలు వేగవంతం చేయాలని డీఎల్‌పీఓ పి.వీణాదేవి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌కు వచ్చిన ఫిర్యాదులకు వెంటనే పరిష్కరించాలన్నారు. ఎంపీడీఓ శ్రీనివాస్, పరిపాలనాధికారి నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



బిక్కవోలు సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ వీణాదేవి

దేవీ నవరాత్ర ఉత్సవాలకు శ్రీకారం



పందలపాకలోని వెలంపేట వద్ద పందిరిరాట వేస్తున్న భక్తులు



పెదపూడి రామాలయంలో స్వామివారు

పెదపూడి: వచ్చే నెల 2న నుంచి జరిగే విజయదశమి ఉత్సవాలకు సంబంధించి సంపర నాగిరెడ్డివారి వీధిలో దుర్గాదేవి అమ్మవారి మంటపం వద్ద బుధవారం పందిరి రాట వేశారు. వేద పండితుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు మాట్లాడుతూ 22 నుంచి శరన్నవరాత్రులు అత్యంత వైభవంగా నిర్వహించనున్నామన్నారు. ఉదయం మంటపం వద్ద విఘ్నేశ్వర పూజ, అనంతరం దుర్గాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

శ్రీరాముని జన్మ నక్షత్ర పూజలు

పెదపూడిలోని మధ్యవీధి నూతన రామాలయంలో శ్రీరాముని జన్మ నక్షత్ర పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు చెరుకూరి రామనాథ కాశ్యపశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నేత కాకర సాయిబాబు, భక్తులు, గ్రామస్తులు నూనె కృష్ణమూర్తి, మార్ని కామరాజుచౌదరి, నూనె వెంకటేశ్వరరావు చౌదరి, మార్ని పెద వెంకట్రావు, నూనె రాజుచౌదరి తదితరులు పాల్గొన్నారు.

పందలపాకలో..

బిక్కవోలు: పందలపాకలోని వెలంపేట రామాలయం వద్ద ఈ నెల 22 నుంచి దేవీ నవరాత్రులను పురస్కరించుకుని రాట ముహూర్తం చేశారు. సర్పంచ్ సబ్బారావు పద్మావతి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సబ్బారపు సూర్యనారాయణరెడ్డి, పంచాయతీ వార్డు సభ్యుడు గుల్లిపిల్లి శ్రీను పాల్గొన్నారు.అలాగే శ్రీసంతోషి మాత ఆలయం వద్ద రాట మంచి కార్యక్రమం నిర్వహించారు. బొడ్డు వెంకట శ్రీను, నాగమణి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. సొసైటీ అధ్యక్షుడు పడాల సూర్యనారాయణరెడ్డి, ఉప సర్పంచ్ పడాల వెంకట రామారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర బూత్ కార్యదర్శి బొడ్డు ముత్యాలరావు పాల్గొన్నారు.

రోడ్డు పనులపై నిరసన



రఘుదేవపురం వద్ద రోడ్డు పనులను అడ్డుకున్న వారితో మాట్లాడుతున్న పోలీసు

సీతానగరం: రఘుదేవపురం – సీతానగరం ఆర్అండ్‌బీ రోడ్డు పనులపై నిరసన వ్యక్తమైంది. కాతేరు నుంచి రఘుదేవపురం వరకూ నాలుగు లైన్ల రోడ్డు వేశారు. ఇక్కడి నుంచి సీతానగరం వరకూ పాత రోడ్డు సెంటర్ నుంచి అటు, ఇటు ఐదు మీటర్లు (30 అడుగులు) రోడ్డుతో సరిపెడుతున్నారు. బుధవారం అర్అండ్‌బీ అధికారులు రఘుదేవపురం నుంచి రోడ్డు పనులు చేపట్టగా, స్థానికులు కందుల హరి శ్రీనివాసరావు, వీరవరపు శివలు పాత రోడ్డు సెంటర్ నుంచి అటు, ఇటు పనులు ప్రారంభించాలని కోరారు. రోడ్డు వేస్తామంటే తమ స్థలాలు స్వచ్ఛందంగా ఇచ్చామని, అటువైపున స్థలాలు ఇవ్వలేదని, అటువంటిది తమ వైపు రోడ్డు ఎక్కువ వేస్తున్నారని స్థానికులు ఆరోపించారు. పాతరోడ్డు మధ్య నుంచి అటు, ఇటు ఐదు మీటర్లు వేయాలని అన్నారు. దీంతో అధికారులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారి వచ్చి ప్రభుత్వ పనులను అడ్డుకుంటే కేసులు అవుతాయని హెచ్చరించారు. దీనితో స్థానికులు మిన్నకుండిపోయారు. తిరిగి సాయంత్రం పనులు అడ్డుకుని, పాతరోడ్డు మధ్య నుంచి కొలతలు చూపించాలని అర్అండ్‌బీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రమణను నిలదీయడంతో గురువారం అధికారులు వచ్చి కొలతలు చూపిస్తారని, అంతవరకూ రోడ్డు పనులు నిలిపివేస్తామని తెలిపారు.

'స్వస్థ నారీ - సశక్త్ పరివార్' ప్రారంభం

సీతానగరం: స్థానిక పీహెచ్‌సీ, చీపురుపల్లి, రాజంపేటలలో స్వస్థ నారీ – సశక్త్ పరివార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీతానగరంలో డాక్టర్ చైతన్య, చీపురుపల్లిలో డాక్టర్ శైలజారాణి, రాజంపేటలో డాక్టర్ యేసు రాణిలు పలువురికి వైద్య సేవలు అందించారు. నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్నచౌదరి, మండల అధ్యక్షురాలు రాపాక వెంకటలక్ష్మి పాల్గొన్నారు

రాజానగరం: ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో స్వస్థ నారీ – సశక్త్ పరివార్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. వైద్యాధికారి రామభాస్కర్, ఎంపీడీఓ జేఏ ఝాన్సీ, వైద్యులు సీహెచ్ వెంకటలక్ష్మి, ఉదయ్ ఏంజెల్ పాల్గొన్నారు.

రంగంపేట: స్థానిక పీహెచ్‌సీ వద్ద స్వస్థ నారీ – సశక్త్ పరివార్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైద్యాధికారి వేణుశ్రీలక్ష్మి మాట్లాడుతూ వచ్చే నెల 2 వరకూ మహిళలకు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. తహసీల్దార్ కోసు అనసూయ, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మండవిల్లి గుప్తా పాల్గొన్నారు.

పెదపూడి: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ నారీ – సశక్త్ పరివార్ అభియాన్‌ను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. సూపరింటెండెంట్ పి.అనుష, వైద్యులు హర్షవర్ధన్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

అధినేతతో ఆత్మీయ కలయిక



మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి గణపతి స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న పీవీ

బిక్కవోలు: తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం కొంకుదురు గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు పడాల వీర వెంకట సత్యనారాయణరెడ్డి (పీవీ) కలిశారు. ఈ సందర్భంగా బిక్కవోలులో కొలువైన లక్ష్మీ గణపతిస్వామి చిత్రపటాన్ని అందించారు.

సమావేశం నుంచి వాకౌట్



సంతకాలు చేసి మండల సమావేశాన్ని వాకౌట్ చేస్తున్న ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు

సీతానగరం: కూటమి ప్రభుత్వం తమకు గౌరవ వేతనం ఇవ్వడం లేదని మండల సమావేశాన్ని ఎంపీటీసీ సభ్యులు బహిష్కరించారు. బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు జరగాల్సిన స్థానిక మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అధ్యక్షతన 4 గంటలకు ప్రారంభించారు. జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు ముదునూరి సురేష్‌రాజు, సత్యం మదన్‌బాబు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కేవీఎస్ఎస్ మూర్తి, వివిధ శాఖాధికారులు పాల్గొనగా, సభ ప్రారంభమైన సమయంలో ఎంపీటీసీ సభ్యులు నిరసన తెలిపారు. ప్రభుత్వం తమకు సరైన గౌరవం ఇవ్వడం లేదని, కొన్ని నెలలుగా వేతనాలు అందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సభకు హాజరైనట్లు సంతకాలు చేసి బహిష్కరించారు. ఎంపీటీసీలకు మద్దతుగా సర్పంచ్‌లు సర్వసభ్య సమావేశాన్ని వాకౌట్ చేశారు. చేసేది లేక అధికారులు సభ నుంచి వెళ్లిపోయారు. ఎంపీపీ జ్యోత్స్న మాట్లాడుతూ గ్రామాల్లో జరిగే కార్యక్రమాలకు కూటమి ప్రభుత్వంలో ప్రోటోకాల్ పాటించడం లేదని, సరైన సమాచారం అందించడం లేదని ఆరోపించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు అరకొరగా అందిస్తున్నారని, సీనరేజ్ నిధులు అసలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైస్ ఎంపీపీ-2 సత్యం మదన్‌బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో మండల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లు ఉందన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



బొమ్మూరులో ఆందోళన చేస్తున్న జేఏసీ నాయకులు, విద్యుత్ ఉద్యోగులు



రాజమహేంద్రవరంలో ఎస్ఈ కార్యాలయం ఎదుట ఉద్యోగుల నిరసన

రాజమహేంద్రవరం రూరల్: విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల సమస్యలను విద్యుత్ యాజమాన్య సంస్థలు వెంటనే పరిష్కరించాలని ఏపీ ట్రాన్స్‌కో ఓఅండ్ఎం సర్కిల్ జేఏసీ చైర్మన్ జగతా అచ్యుతరామయ్య డిమాండ్ చేశారు. బొమ్మూరులోని 220 కేవీ సబ్ స్టేషన్ వద్ద బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఆయన ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు కేఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ తమ డిమాండ్లు పరిష్కరించే వరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు. జేఏసీ కోశాధికారి పి.విజయశ్యామల మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జేఏసీ నాయకుడు గుత్తుల అన్నవరం ప్రసాద్, కాంట్రాక్టు కార్మిక సంఘ నేత డేవిడ్‌రాజు మాట్లాడుతూ విద్యుత్ యాజమాన్యం మొండి వైఖరి విడనాడాలన్నారు. జేఏసీ నాయకులు అనిల్, గంగరాజు, కె.చంద్రశేఖరరెడ్డి, బాబి, జేఏఓ మంగాదేవి పాల్గొన్నారు.

కడియం: విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ ట్రాన్స్‌కో ఓఅండ్ఎం సర్కిల్ జేఏసీ కన్వీనర్ రవికుమార్ డిమాండ్ చేశారు. భోజన విరామ సమయంలో వేమగిరిలోని 400 కేవీ సబ్ స్టేషన్ వద్ద విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ విద్యుత్ సంస్థలలో కాంట్రాక్టు కార్మికులను విలీనం చేయాలని డిమాండ్ చేశారు.

రాజమహేంద్రవరంలో..

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు ఆందోళన విరమించేది లేదని జేఏసీ చైర్మన్ వీవీఎస్ నాగేశ్వరరావు, కన్వీనర్ ఎ.రాజారత్నం అన్నారు. రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర, డిస్కం ఐక్య కార్యాచరణ కమిటీ ఆదేశానుసారం రాజమహేంద్రవరం ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. దీనికి అన్ని డివిజన్ల యూనియన్లు, అసోసియేషన్ల నుంచి పెద్దఎత్తున విద్యుత్ ఉద్యోగులు హాజరయ్యారు. విద్యుత్ ఉద్యోగులకు, పెన్షనర్లకు, వారి కుటుంబ సభ్యులకు పూర్తి వైద్య ఖర్చుల చెల్లింపు, రాష్ట్ర ప్రభుత్వంలో అమలులో ఉన్న జీపీఎఫ్‌తో కూడిన పెన్షన్ నిబంధనలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి పలుకుదాం



వలంటీర్లు తయారు చేసిన వస్త్ర సంచులను ప్రదర్శిస్తున్న దృశ్యం

రాజానగరం: ప్రజారోగ్యానికి ముప్పు తెచ్చే ప్లాస్టిక్ సంచుల వినియోగానికి స్వస్తి పలుకుదామని రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వరం పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వినియోగం.. పర్యావరణానికి హాని అనే నినాదంతో స్థానిక గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ, ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. క్లాత్, జ్యూట్ సంచులను వాడటం ద్వారా ప్లాస్టిక్‌ను పూర్తిగా దూరం చేయవచ్చన్నారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తయారు చేసిన వస్త్ర సంచులను ప్రదర్శించారు. కార్యక్రమంలో వలంటీర్లు, పీఓ, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



అనపర్తిలో స్వస్థ నారీ- సశక్త్ పరివార్ కార్యక్రమ పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న వైద్యులు

అనపర్తి: ప్రధాని మోదీ జన్మదినోత్సవం సందర్భంగా బుధవారం నుంచి అక్టోబర్ 2 వరకు సేవా పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అనపర్తి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ టి.రామగుర్రెడ్డి తెలిపారు. స్వస్థ నారీ- స్వశక్త్ పరివార్ అభియాన్ పేరుతో నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక వైద్య శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 19న అసంక్రమిత వ్యాధులకు జరిగే శిబిరంలో క్యాన్సర్, మధుమేహం, రక్తపోటు తదితర వ్యాధులకు స్క్రీనింగ్ పరీక్షలు చేస్తారని తెలిపారు. వయో వృద్ధులు, బాలింతలు ఎటువంటి ఆహారం తీసుకోవాలనేది వివరిస్తామన్నారు. ఆస్పత్రి వైద్య సిబ్బంది, అభివృద్ధి కమిటీ సభ్యుడు దాకే దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పలువురికి పరామర్శ



సూర్యచంద్రావతిని పరామర్శిస్తున్న డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు

అనపర్తి: రామవరం గ్రామానికి చెందిన పలువురు పార్టీ నేతలను అనపర్తి మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు బుధవారం పరామర్శించారు. మండల పార్టీ అధికార ప్రతినిధి నల్లమిల్లి వెంకటరెడ్డి, అలాగే తూర్పుగోదావరి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్రి వెంకటరెడ్డి ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్నారు. పంచాయతీ పాలక మండలి మాజీ సభ్యురాలు గుత్తుల సూర్యచంద్రావతి (బేబీ) ఇటీవల వైద్యం పొందారు. వారితో పాటు కుటుంబ సభ్యులను డాక్టర్ సూర్యనారాయణరెడ్డి దంపతులు పరామర్శించారు. కార్యక్రమంలో అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి, కర్రి గాంధీరెడ్డి, నల్లమిల్లి ఎరకారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ బాధ్యతగా చేపట్టాలి



కైకవోలులో చెత్త సేకరణపై వివరిస్తున్న సత్యనారాయణరెడ్డి

పెదపూడి: గ్రామాల్లో చెత్త సేకరణను క్లాప్ మిత్రలు బాధ్యతగా చేపట్టాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం కైకవోలులో క్లాప్ మిత్రలు చేస్తున్న చెత్త సేకరణ, పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. అలాగే గ్రామంలో అన్ని వీధులను చూశారు. చెత్త సేకరణ ఏ విధంగా ఉందో ప్రజలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సచివాలయ కార్యదర్శి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

సీతానగరం: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని నార్కోటిక్ డిపార్ట్‌మెంట్ సీఐ పీవీ సూర్యమోహన్ అన్నారు. బుధవారం సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన సదస్సును ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. సీఐ సూర్యమోహన్ మాట్లాడుతూ నాగరికత అంటే మత్తుకు బానిసై సమాజాన్ని నాశనం చేయడం కాదన్నారు. వైస్ ప్రిన్సిపాల్ హరే రామకృష్ణ మాట్లాడుతూ యువత భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. నార్కోటిక్ డిపార్ట్‌మెంట్ హెడ్ కానిస్టేబుల్ మధుసూదనరెడ్డి, అధ్యాపకులు షేక్ మదీనా, సుబ్బారావు, డాక్టర్ సుధామయి, నాగేశ్వరరావు, డాక్టర్ మాధవ్ పాల్గొన్నారు.